క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి



నందవరంలో నిర్మించిన సీసీ రోడ్డు

నందవరం: మండలంలోని పల్లెల్లో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణాలను పీఆర్ అధికారులు వేగంగా పూర్తి చేశారు. గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.5 లక్షలతో వీరభద్రప్ప స్వామి ఆలయం నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఇప్పటివరకు మండల కేంద్రంలో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.7 లక్షలతో డ్రైయినేజీలు నిర్మించారు. ఆయా పనులు దాదాపు పూర్తికాగా మిగతావి శరవేగంగా పనులు జరుగుతున్నాయి.

స్నేహితురాలి చికిత్సకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మద్దికెర: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు.. మిత్రురాలు హసీనా దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఆమె కోలుకోవాలని ఆకాంక్షించారు. పూర్వ విద్యార్థులు హరినారాయణ, విశ్వనాథ రాజశేఖర్, పుల్లన్న, పీరా తదితరులు ఉన్నారు.

హత్యకేసులో ముమ్మర విచారణ

- మరో ఇద్దరు అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామంలో కురువ నాగమ్మను ఆమె మనుమడు వెంకటేష్ గొంతు నులిమి చంపి ఆమె బంగారుతో సెల్‌ఫోన్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. వెంకటేష్ ఒక్కడే నానామ్మను హత్య చేసి ఇంటి ఆవరణలో గుంత తవ్వి పూడ్చడం సాధ్యమయ్యే పనేనా అనే అనుమానాలు గ్రామంలో వ్యక్తమవుతున్నాయి. వెంకటేష్‌తో పాటు గ్రామంలో మరో ఇద్దరు యువకులపై అనుమానం రావడంతో వారిని పోలీసులు ఆదివారం విచారణ చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై సీఐ రామకృష్ణయ్యను వివరణ కోరగా అనుమానంతోనే ఇద్దరు యువకులను విచారిస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో సచివాలయం వెనుక ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని ఈఓ సంజప్ప, సర్పంచ్ బురుజుల విజయుడు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 261 నందు 1.87 ఎకరాల బైలు స్థలం ఉందన్నారు. చుట్టుపక్కల ఉంటున్న వారు అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారన్నారు. పలుమార్లు హెచ్చరించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. స్థలాన్ని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసుకోడానికి పోలీస్ శాఖ వారు సహకరించాలని కోరారు. అనంతరం ఎస్‌ఐ రమేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలం ఆక్రమించడానికి ఎవరికీ హక్కు లేదని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

19న నారాయణతాత ఆరాధన



నారాయణ స్వామి

ఆస్పరి: మండలంలోని హాలిగేర గ్రామంలో వెలసిన నారాయణ తాత స్వామి 35వ ఆరాధనోత్సవాలు ఈనెల 19వ తేదీన నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. ఈనెల 19న నారాయణ స్వామి సమాధికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు, మంగళహారతులు, సాయంత్రం ప్రభోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రవీణ



హొళగుంద: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రవీణ నియమితులయ్యారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేస్తున్న సుబ్రమణ్యం రెండున్నరేళ్ల క్రితం ప్యాపిలికి బదిలీఅయ్యారు. అప్పటి నుంచి ఇన్‌చార్జులతో కళాశాల కొనసాగింది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలులో పనిచేస్తున్న ప్రవీణను ఉన్నతాధికారులు హొళగుందకు నియమించారు. ఆమె శనివారం బాధ్యతలు చేపట్టగా లెక్చరర్లు స్వాగతం పలికారు.

నేమకల్లు.. అభివృద్ధి వర్ధిల్లు

- సీసీ రోడ్లు, ప్రభుత్వ భవనాలతో మారిన గ్రామ ముఖచిత్రం
- వైఎస్సార్‌సీపీ పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.26.51 కోట్ల లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



నేమకల్లులో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు

చిప్పగిరి: దేశానికి పట్టుగొమ్మలు పల్లెటూళ్లు. పల్లెటూళ్లు అభివృద్ధి చెందితేనే దేశ ప్రగతి వికసిస్తుంది. ఈ నినాదాన్ని అక్షరాలా నిజం చేసేలా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగుతోంది. రాష్ట్ర ప్రజలు మునుపెన్నడూ చూడని సంక్షేమం, అభివృద్ధిని చేసి చూపుతూ దేశంలోనే ఆదర్శ పాలన సాగిస్తున్నారు. మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా గత ప్రభుత్వాల పాలనకు, ప్రస్తుత జగనన్న పాలనకు తేడా స్పష్టంగా కనిపిస్తోందని ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి నిదర్శనంగా సందుసందునా వెలసిన సీసీ రోడ్లు, మౌలిక సౌకర్యాలు నిలుస్తున్నాయి. నాలుగున్నరేళ్ల పాలనలోనే ప్రతి గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసి అన్ని శాఖల అధికారులను నియమించడం ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేశారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌ల ద్వారా అన్ని సౌకర్యాల్లో గ్రామాల్లోనే అందుబాటులోకి తెచ్చారు. ఆయా కార్యాలయాల భవనాలు, కాలనీల్లోని సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సౌకర్యాలు ప్రభుత్వ అభివృద్ధి పాలనకు అద్దం పడుతున్నాయి.

గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలు అందిస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా గ్రామాల ప్రజలకు ప్రభుత్వ సేవల కోసం వ్యయప్రయాసలు తప్పాయి. మండల కేంద్రానికి 10 కి.మీ దూరంలో ఉన్న నేమకల్లు గ్రామం మండలంలోని పెద్ద గ్రామాలలో ఒకటి. ఈ గ్రామంలో 3,368 మంది ఓటర్లు ఉన్నారు. ఈ గ్రామం మారుమూలన ఉండడంతో గత పాలకులు ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో అభివృద్ధికి ఆమడ దూరంలోనే నిలిచిపోయింది. గ్రామంలో ఏ కాలనీకి వెళ్లినా మురుగు నీరు రోడ్లపై పారుతూ దుర్గంధం వెదజల్లుతుండేది. గ్రామవాసులు నానా తిప్పలు పడుతూ జీవనం సాగిస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సౌకర్యాలు కల్పించడంతో గ్రామం రూపురేఖలు మారి అభివృద్ధికి నిలువుటద్దంలా మారింది.

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు

గ్రామంలో రూ.39 లక్షలతో నూతన సచివాలయ భవనం నిర్మించడంతో ప్రభుత్వ సేవలన్నీ స్థానికంగానే అందుబాటులోకి వచ్చాయి. దశాబ్దాల నుంచి గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్న ప్రధాన కూడలి నుంచి రాంపురయ్య వీధి వరకు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. అనేక కాలనీలలో డ్రైనేజీలు నిర్మించారు. రూ.18 లక్షలతో చేపట్టిన రైతు భరోసా కేంద్రం నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. అలాగే గడిచిన నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.26.51 కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమచేశారు.



గ్రామ సచివాలయ భవనం



నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం

సమస్యలకు శాశ్వత పరిష్కారం



గ్రామంలో దశాబ్దాల కాలం నుంచి నెలకొన్న సమస్యలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో శాశ్వత పరిష్కారం లభించింది. గతంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇప్పుడు ఆ సమస్యలన్నీ తొలగిపోయాయి. ప్రధాన వీధితో పాటు అనేక కాలనీలో సీసీ రోడ్లు నిర్మించారు. ఐదేళ్లలోనే గ్రామ రూపురేఖలు మారిపోయాయి.

– నెట్టికల్లు, నేమకల్లు గ్రామస్తుడు

అందుబాటులో ప్రభుత్వ సేవలు



గతంలో ఏ చిన్న పనికైనా మండల కేంద్రానికి పరుగెత్తాల్సిన పరిస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో గ్రామంలోనే సేవలన్నీ అందుతున్నాయి. నిజమైన గ్రామ స్వరాజ్యం జగనన్న పాలనలో సాకారం అయ్యింది. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు.

– సుంకన్న, నేమకల్లు గ్రామస్తుడు

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

హాలహర్వి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి గెలుపొందడం ఖాయమని కురువ కార్పొరేషన్ జిల్లా డైరెక్టర్ బజారప్ప పేర్కొన్నారు. ఆయన ఆదివారం గూళ్యం గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి సీఎం వైఎస్ ఎంతోగానో కృషి చేశారన్నారు. కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలే మరోసారి వైఎస్సార్‌సీపీకి అఖండ విజయం అందిస్తాయని దీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వన్నూరప్ప, దిబ్బలింగ, గాదిలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

పత్తికొండ రూరల్: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆర్డీఓ నీలవు రామలక్ష్మి ఆదేశాల మేరకు ఆదివారం పత్తికొండలోని ప్రధాన రోడ్డు కూడళ్లలో వివిధ రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగులను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఆమె కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలో ఎంపీడీఓ శివశంకరప్ప ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీలు తమ తమ పరిధిలో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. ప్రభుత్వ కార్యాలయాలలో సైతం ప్రజాప్రతినిధుల ఫొటోలు తొలగించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: ఆంధ్ర, కర్ణాటక భక్తుల ఆరాధ్య దైవం దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామికి ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున పూజారులు స్వామివారి మూల విరాట్‌లకు సుప్రభాత సేవ, అభిషేకాలు, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు రుద్రాభిషేకం ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పార్టీ విజయానికి కృషి



చిప్పగిరిలో ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షిని కలిసిన వివిధ గ్రామాల నాయకులు

ఆలూరు: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి తమవంతుగా కృషి చేస్తామని వివిధ మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు స్పష్టం చేశారు. వారు ఆదివారం చిప్పగిరిలో ఎమ్మెల్యే అభ్యర్థి బసినె విరూపాక్షిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హొళగుంద, దేవనకొండ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను కలిసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా విరుపాక్షి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడి చేసేవారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సర్పంచ్‌లు హరికృష్ణ, పెద్దరెడ్డి, మోహన్, డీసీసీబీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, వీరేష్, రంగన్న, నాయకులు బసవరాజ్, వెంకటేష్, తోయజాక్షప్ప తదితరులు ఉన్నారు.

చేసిన మేలును వివరిద్దాం

హొళగుంద: టీడీపీ అధినేత చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో చేయలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో చేసి చూపించారని వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు, మండల కన్వీనర్ షఫివుల్లా స్పష్టం చేశారు. ఆదివారం హొళగుందలో 'మేము సిద్ధం..మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. జగనన్న పాలనలో రెండేళ్లు కరోనా కారణంగా ఖజానాకు ఎలాంటి ఆదాయం లేకపోయినా సంక్షేమం, అభివృద్ధిని నిలపలేదన్నారు. ప్రతి గ్రామంలో స్కూళ్లు, హాస్పిటళ్లు, సచివాలయాలు, సీసీ రోడ్లు, పల్లె రోడ్లు ఇలా జరిగిన ప్రతి అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చెప్పాలన్నారు. సంక్షేమ పథకాలు ఇవ్వడం వల్ల ఏపీ మరో శ్రీలంక అవుతుందని ఎద్దేవా చేసిన చంద్రబాబు ఇప్పుడు ఎన్నికల సమయంలో సంక్షేమ పథకాలను మరింత పెంచి ఇస్తానని మోసపూరిత మాటలు చెబుతున్నాడని, ప్రజలు నమ్మవద్దన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో కోగిలతోట, పెద్దహ్యాట, లింగంపల్లి, హెబ్బటం–ఇంగళదహాళ్, సమ్మతగేరి, వందవాగిలి, ముగుమానుగుంది, ఆలూరు రోడ్లు తారు రోడ్లుగా మారాయని, దశబ్దాల కాలంగా మరమ్మతులకు నోచుకోని మార్లమడికి రోడ్డు త్వరలో రెండు లైన్ల తారు రోడ్డుగా మారుతుందన్నారు. చంద్రబాబు పాలనలో మండలంలో సంక్షేమ పథకాలు కాదు కదా కనీసం ఒక్క రోడ్డైనా వేశాడా అని ప్రశ్నించారు. గత చంద్రబాబు పాలన, ప్రస్తుత జగనన్న పాలనలో తేడాను కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి వివరించి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు.

21 నుంచి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు



రంగనాథ స్వామి ఆలయం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథుడి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పది రోజుల పాటు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ ఈడిగ దస్తగిరి గౌడ్ తెలిపారు. 21న ధ్వజారోహణం, 22న సింహోత్సవం, 23న శేషోత్సవం, 24న లంకోత్సవం, 25న గరుడోత్సవం, 26న గజోత్సవం, 27న తెల్లవారుజామున చిత్తానక్షత్రంలో స్వామి వారి కల్యాణోత్సవం, అదే రోజు ఉదయం 10 గంటలకు రథాంగ హోమం, బ్రహ్మరథం, సాయంత్రం అశేష జనవాహిని మధ్య రథోత్సవం నిర్వహించనున్నారు. 28న అశ్వవాహనం, 29న ఉదయం పూర్ణాహుతి, వసంతోత్సవం, రాత్రి హంసవాహన సేవ, 30న ద్వాదశ ప్రదక్షిణోత్సవాలు, రాత్రి పాన్పు సేవ ఉంటాయన్నారు. భక్తులు బ్రహ్మోత్సవాలలో విరివిగా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

తల్లి గెలుపునకు తనయుడి ప్రచారం



ఎమ్మిగనూరు 4వ వార్డులో ప్రచారం చేస్తున్న బుట్టా ప్రతూల్

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక గెలుపు కోసం ఆమె తనయుడు ప్రతూల్ ఆదివారం పట్టణంలోని 4, 6వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. వృద్ధులు, మహిళలు, వ్యాపారులు, చేనేతలను కలిసి వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అగిగి తెలుసుకున్నారు. ఆయా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకం కింద ఏటా రూ.24 వేలు అందించి నేత పనికి పూర్వ వైభవం కల్పించిన ఘనత సీఎం జగనన్నదే అని చేనేతలకు తెలియజేస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తన తల్లి బుట్టా రేణుకను గెలిపించాలని అభ్యర్థించారు. పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బుట్టారంగయ్య, కౌన్సిలర్లు అమాన్, ఎంకే శివప్రసాద్, వార్డు ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కస్తూర్బాలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

హొళగుంద: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ప్రవేశం పొందడానికి ఏప్రిల్ 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ దివ్య భారతి సూచించారు. ఆమె మాట్లాడుతూ.. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతితో పాటు ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్ కోసం అన్ని సర్టిఫికెట్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన నిరుపేద విద్యార్థినులు, అనాథ బాలికలు, బడిఈడు, బడి వదిలేసిన బాలికలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, విద్యార్థినులు ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉండాలని చెప్పారు. ప్రస్తుతం కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్ ఫస్ట్‌ఇయర్‌లో 40 సీట్లు చొప్పున ఖాళీగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి త్వరలో ప్రకటన వస్తుందని చెప్పారు. నిరుపేద విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కృష్ణగిరి: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ చైతన్య స్రవంతి తెలిపారు. 6వ తరగతిలో 40, ఇంటర్ బైపీసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు.

చంద్రబాబువి సూపర్ ఫేక్ హామీలు

- 29వ వార్డులో ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక ప్రచారం
- రైతులు, పశుపోషకుల సమస్యల పరిష్కారానికి హామీ



ఎమ్మిగనూరు ఎద్ల మార్కెట్‌లో రైతుల సమస్యలను తెలుసుకుంటున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు నమ్మి మోసపోవద్దని అవన్నీ సూపర్ ఫేక్ హామీలు మాత్రమేనని వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక పేర్కొన్నారు. గత ఎన్నికల ముందు ఇలాంటి మోసపూరిత హామీలు ఇచ్చినందుకే నాడు టీడీపీని ప్రజలు ఇంటికి సాగనంపారని గుర్తుచేశారు. ఆదివారం పట్టణంలోని 29వ వార్డులో కౌన్సిలర్ రజిత, వార్డు ఇన్‌చార్జ్ ప్రతాప్‌రెడ్డితో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆమె మాట్లాడుతూ.. సీఎం జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పథకాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలుచేసి అర్హులైన ప్రతిఒక్కరికీ లబ్ధిచేకూర్చారని వివరించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్నను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన నాయకుల మాయ మాటలు, మోసపూరిత హామీలు నమ్మి మోసపోవద్దని సూచించారు. చంద్రబాబు గతంలో అలవిగాని హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక నెరవేర్చకుండా ప్రజలను నిండా ముంచారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వార్డు పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇచార్జ్‌లు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి హామీ

రైతులు, పశుపోషకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని బుట్టా రేణుక హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక ఎద్ల మార్కెట్‌ను సందర్శించి సంతకు వచ్చిన రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లో నీటి వసతి కల్పించడంతో పాటు జకాతి తగ్గించాలని పలువురు కోరగా పరిష్కారంపై దృష్టి సారిస్తామన్నారు. అలాగే సాగునీటి కోసం గుండ్రేవుల ఎత్తిపోతల పథకం, ఆర్‌డీఎస్ కుడి కాలువ నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. ఇక్కడినుంచి తెలంగాణలో పశువుల విక్రయానికి వెళితే అక్కడి బీజేపీ నేతలు తమ పశువులను గోశాలకు తరలిస్తున్నారని కొందరు వ్యాపారులు ఆమెతో గోడు వెళ్లబోసుకోన్నారు. మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, ప్రతూల్, ఎంపీపీ కేశన్న, మున్సిపల్ వైస్‌చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, వార్డు కౌన్సిలర్ సంధ్య, ఇన్‌చార్జ్ రామాంజినిరెడ్డి, కౌన్సిలర్లు రాజారత్నం, కోటకొండ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

మద్దికెర: మండలంలో ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రజాక్‌వలి అన్నారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాలలో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయడంతో పాటు ఫ్లెక్సీలను రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. దుకాణాల వద్ద గాని, ఇళ్ల మీద గానీ రాజకీయాలకు సంబంధించిన జెండాలు, గోడ పత్రికలు, ఫ్లెక్సీలు ఉండరాదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

హాలహర్వి: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అందరూ ఎన్నికల నియామవళికి అనుగుణంగా నడుచుకోవాలని ఎస్‌ఐ నరేంద్ర సూచించారు. ఆదివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, అల్లర్లు, గొడవలకు దిగినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల అధికారులు, పోలీసు శాఖ చర్యలు తీసుకుందన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి



మృతి చెందిన అల్లాబకాష్

కృష్ణగిరి: పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కొలుకోలేక మృతి చెందాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని లాల్‌మాన్‌పల్లెకు చెందిన అల్లాబకాష్ (42), హలిమా దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 14న అల్లాబకాష్ మామిడి చెట్లకు పూత రాలకుండా మందు స్ప్రే చేసి వస్తానని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉండటాన్ని గుర్తించిన రైతులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే డోన్ ఆస్పత్రికి అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా కొలుకోలేక ఆదివారం అల్లాబకాష్ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కుమార్తె వివాహం, వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేమనే మనస్తాపంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య హలిమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు



ఎంఎస్ బాలికల హైస్కూల్ పరీక్షా కేంద్రం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంతో పాటు మండలంలోని ఉన్నత పాఠశాలలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు సోమవారం నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం పట్టణంలో 10 పరీక్షా కేంద్రాలు, మండలంలోని బనవాసిలో మరో 2 పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆయా కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్, బాలికల రెసిడెన్సియల్ స్కూళ్లకు చెందిన 2850 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకై 135 మంది ఇన్విజిలేటర్లు, 12 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 12 మంది చీఫ్‌లు, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు ఎంఈఓ–1, 2 ఆంజనేయులు, మధుసూదన్‌రాజు ఆదివారం తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరిగినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లను విద్యార్థులు, ఇన్విజిలేటర్లు తీసుకెళ్లకూడదని సూచించారు. అదేవిధంగా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని వారు తెలిపారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం



తుగ్గలిలో సిద్ధం కరపత్రాలను ప్రదర్శిస్తున్న వైఎస్సాన్‌సీపీ నాయకులు

తుగ్గలి: రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖరరెడ్డి అన్నారు. మేము సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవితో కూడిన స్టిక్కర్లను ఆదివారం ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యుల అనుమతితో అతికించారు. వారు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంపూర్ణ న్యాయం జరిగిందన్నారు. ఎవరి సిఫార్సు లేకుండానే అర్హులకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. ప్రభుత్వ పథకాలే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు దోహదపడతాయని వారు ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారంతా వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

ముగిసిన ఉరుసు



స్వామి వారికి గంధం తీసుకెళుతున్న పీఠాధిపతులు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన సద్గురు మహాత్మ బడేసాహెబ్ తాత ఉరుసు ఘనంగా ముగిసింది. శుక్రవారం గంధం, శనివారం ఉరుసు మహోత్సవం, ఆదివారం జియారత్ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఫాతెహాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి దర్గా పీఠాధిపతులు మన్సూర్, ఉసేన్, బడేసా, చాంద్‌బాషా తదితరులు స్వామి వారి గంధంతో మేళతాళలతో ఊరేగింపుగా దర్గాకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వామి వారి జీవసమాధికి గంధం పట్టించారు. సమాధిని పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

దర్గాను దర్శించుకున్న ప్రముఖులు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, భర్త నీలకంఠ, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి దంపతులు, కేడీసీసీ బ్యాంక్ జిల్లా చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి దర్గాను దర్శించుకొని స్వామి వారికి ప్రత్యేక ఫాతెహాలతో పూజలు చేశారు.